సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



అభివృద్ధికి దూరంగా గుబిడిపల్లి

భీంపూర్ మండలంలోని గుబిడిపల్లి గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. కనీస సౌకర్యాలు కరువవడంతో గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు. 9లో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఉపకార వేతనాల మంజూరు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి సునీతకుమారి ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 వరకు ఈ-పాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కోరారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 44 లీజ్ స్థలాలకు గాను 2020 వరకు 24 ఉండగా, తాజాగా 8 స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. అక్రమార్కులు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు బల్దియా అధికారుల సహకారంతో మ్యూటేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. సర్వే నం.170లో అక్రమంగా ఇంటి నంబర్లు తీసుకొని 3వేల ప్లాట్లను విక్రయించారని, అందులో నిర్మాణాలు కూడా చేపట్టారన్నారు. కబ్జాకు గురైన 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాకు విస్తరిస్తూ నిర్ణయించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీశ్, దర్శనాల లక్ష్మణ్, సంద నర్సింగ్, ఆవుల వెంకన్న, తదితరులున్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి

ఆదిలాబాద్‌టౌన్: రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. రిమ్స్ ఆవరణలోని టీబీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రిమ్స్‌లోని మలేరియా ల్యాబ్, ఏఆర్టీ సెంటర్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది పనితీరును అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్, వైద్యులు సాయిప్రియ, వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు కృష్ణ తదితరులు ఉన్నారు.

నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించాలి



లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: గణేశ్ నవరాత్రోత్సవాలను సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి లోగోను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండపాల నిర్వాహకులు ఉత్సవ సమితికి అన్ని విధాలుగా సహకరించాలని సూచించారు. వీలైనంతవరకు మట్టి గణపతులను ప్రతిష్టించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇందులో ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి లెనిన్, భాస్కర్‌గౌడ్, ఉదయ్‌కుమార్, విశ్వనాథ్, రాజకుమార్ పాల్గొన్నారు.



భీంపూర్ మండలం అర్లి(టి) శివారులో పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో దెబ్బతిన్న పత్తిపంట

గెరువిచ్చిన వాన

- శాంతించిన పెన్‌గంగ
- తేలుతున్న పంట నష్టం
- ఎగువ నుంచి కొనసాగుతున్న వరద
- మత్తడివాగు మూడు గేట్లు ఓపెన్

ఐదు రోజుల్లో జిల్లాలో సగటున నమోదైన వర్షపాతం వివరాలు.. (మి.మీ.లలో)

ఆగస్టు 30	28.5
ఆగస్టు 31	3.2
సెప్టెంబర్ 1	79.1
సెప్టెంబర్ 2	48.5
సెప్టెంబర్ 3	29.4

సాక్షి,ఆదిలాబాద్: ఎట్టకేలకు వరుణుడు శాంతించాడు. జిల్లాలో ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టాయి. తాంసి, తలమడుగు ప్రాంతాలకు మాత్రం ఎగువ నుంచి వరద కొనసాగింది. పొరుగున ఉన్న మహారాష్ట్రలోని గుట్టలు ఉన్న చోట కురుస్తున్న వర్షాలతో మత్తడివాగు ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది.మంగళవారం సాయంత్రం మూడు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదిలారు. మరోవైపు పెన్‌గంగ ఉధృతి క్రమంగా తగ్గుతూ వస్తుంది. జైనథ్, బేలలో బ్యాక్‌వాటర్ ముప్పు తప్పినా పంట లకు మట్టి పేరుకపోవడంతో కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వర్షాలు విరామం ఇస్తే ఇవి తేరుకునే పరిస్థితి ఉంటుంది. లేకుంటే నష్టం తప్పదు.

జిల్లాలో 29.4 మి.మీ వర్షపాతం..

జిల్లాలో మంగళవారం 29.4 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. గుడిహత్నూర్‌లో అత్యధికంగా 77.1 మి.మీ.లు, నేరడిగొండలో 67.1, ఇచ్చోడలో 55, తాంసిలో 49.2, ఆదిలాబాద్‌అర్బన్ 41.4, ఆదిలాబాద్‌రూరల్ 33.4, భీంపూర్ 28.8, మావల 26.7, తలమడుగు 24.3 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉంటే సాత్నాల ప్రాజెక్టుకు 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రస్తుతం నాలుగు గేట్లు మూసివేసి ఉన్నాయి. ఇక మత్తడివాగుకు సంబంధించి మంగళవారం సాయంత్రం 17,808 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 18,100 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఐదు గేట్లు ఉండగా, మూడు గేట్లు ఎత్తి వరదను దిగువకు వదులుతున్నారు.

పంటలకు ముప్పుతప్పేనా..

జిల్లాలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఏడుమండలాలు జైనథ్, తలమడుగు, తాంసి, భీంపూర్, బేల, గాదిగూడ, ఉట్నూర్ మండలాల్లోని 41 గ్రామాల్లో 720 మంది రైతులకు చెందిన 1,849 ఎకరాలు నీట మునిగాయి. జైనథ్, బేల, భీంపూర్ మండలాల్లో పెన్‌గంగ బ్యాక్ వాటర్ కారణంగా పంట చేలను పూర్తిగా వరద ముంచెత్తింది. అయితే పెన్‌గంగ ఉధృతి తగ్గడంతో బ్యాక్ వాటర్ ముప్పు తప్పింది. ఇక పంటలు తేరుకోవాల్సిన పరిస్థితి ఉంది.

రహదారులకు నష్టం..

భారీ వర్షాల కారణంగా రహదారులకు నష్టం చేకూరింది. ఆర్‌అండ్‌బీకి సంబంధించి 32 కిలో మీటర్ల రోడ్డు ధ్వంసమైంది. అలాగే 15 కల్వర్టులు దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ. కోటి 92 లక్షలు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా ఇందులో లోలెవల్ వంతెనలు అధికంగా ఉన్నాయి. ఇక శాశ్వత పనుల కోసం రూ.93 కోట్లు అవసరమవుతాయని ఈ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. పంచాయతీరాజ్ రోడ్లకు కూడా తీవ్రంగా నష్టం చేకూరింది. అయితే ఆ వివరాలు తెలియరాలేదు.

సాధారణం మించిన వర్షపాతం..

జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 853.4 మి.మీ.లు కాగా, 991.4 మి.మీ.లు కురిసింది. ఇది సాధారణం కంటే 16 శాతం అధికం. జిల్లాలోని ఏడు మండలాల్లో భీంపూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్‌రూరల్, ఆదిలాబాద్‌అర్బన్, మావల, ఉట్నూర్‌లలో ఇప్పటివరకు అధిక వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసింది.



'మత్తడివాగు' పరవళ్లు..

తాంసి: మండలంలోని వడ్డాడి వద్ద గల మత్తడి వాగు ప్రాజెక్టు మూడు గేట్లను అధికారులు మంగళవారం సాయంత్రం ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లను ఎత్తే అవకాశం ఉంటుందని ఏఈ హరీశ్‌కుమార్ తెలిపారు. దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

ప్రాజెక్టుల్లో నీటిమట్టం వివరాలు..

ప్రాజెక్ట్	పూర్తిస్థాయి నీటిమట్టం	ప్రస్తుతం	నీటి నిల్వసామర్థ్యం	ప్రస్తుతం
సాత్నాల	286.50 మీటర్లు	285.60 మీటర్లు	1.24 టీఎంసీ	1.035 టీఎంసీ
మత్తడి వాగు	277.50 మీటర్లు	277.40 మీటర్లు	0.571 టీఎంసీ	0.557 టీఎంసీ

17మంది కేజీబీవీ ఉద్యోగులకు స్థానచలనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న 17మంది ఉద్యోగులకు మంగళవారం స్థానచలనం కలిగింది. ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులు కేజీబీవీల్లో పనిచేస్తున్న ప్రత్యేక అధికారులతో పాటు సీఆర్టీ, పీజీసీఆర్టీ, పీఈటీ, ఏఎన్‌ఎం, అకౌంటెంట్లకు బదిలీ (షిఫ్టింగ్) కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో జిల్లాలో 54 మంది జిల్లా పరిధిలో దరఖాస్తు చేసుకోగా, ఇతర జిల్లాలకు వెళ్లేందుకు 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో జిల్లాలో పనిచేస్తున్న 17 మందికి స్థానచలనం జరిగింది. ఇందులో ముగ్గురు ఎస్‌వోలు కొత్త స్థానాలకు బదిలీ అయ్యారు. తలమడుగులో పనిచేస్తున్న ఎస్‌వో మావల కేజీబీవీకి, ఇంద్రవెల్లిలో పనిచేస్తున్న ప్రత్యేక అధికారి తాంసికి, గాదిగూడలో పనిచేస్తున్న ఎస్‌వో ఇంద్రవెల్లికి బదిలీ అయ్యారు. వీరితో పాటు తోషంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎం మావల కేజీబీవీకి, తలమడుగులో పనిచేస్తున్న అకౌంటెంట్ మావల కేజీబీవీకి బదిలీ అయ్యారు. అలాగే తోషంలో పనిచేస్తున్న పీఈటీ తాంసికి, తాంసిలో పనిచేస్తున్న పీఈటీ మావలకు బదిలీ అయ్యారు. తలమడుగులో పనిచేస్తున్న బోటనీ పీజీసీఆర్టీ ఆదిలాబాద్‌అర్బన్‌కు స్థానచలనం కలిగింది. అయితే ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులకు సంబంధించి ఇంకా వివరాలు తెలియరాలేదు. ఈ బదిలీలకు సంబంధించి విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది.

జనవరి వరకు ఐటీటవర్ ఫేజ్–1



ఆదిలాబాద్‌లోని ఐటీ టవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

- జిల్లాలో సీసీఐ పునరుద్ధరణకు కృషి
- పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో కరకట్టలు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

కైలాస్‌నగర్: రానున్న జనవరి నెలాఖరు వరకు జిల్లాలో ఐటీటవర్ ఫేజ్-1 అందుబాటులోకి రానుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. ముందుగా జైనథ్ మండలంలో పెన్‌గంగ ఉధృతిని పరిశీలించారు. ఇరిగేషన్‌శాఖ అధికారులతో మాట్లాడి వరద కారణంగా పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాకేంద్రంలో మూతపడ్డ సీసీఐ ఫ్యాక్టరీ, రూ.40కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఐటీ టవర్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అంతకుముందు జిల్లా కేంద్రానికి విచ్చేసిన మంత్రికి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ సైతం మంత్రిని పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పట్టణంలోని సీసీఐ పరిశ్రమను పరిశీలించారు. మేనేజర్‌తో మాట్లాడి పరిశ్రమకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూతపడ్డ సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్రం సానుకూలంగా ఉందన్నారు. ఇటీవల కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసి పరిశ్రమ పునరుద్ధరణపై చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పరిశ్రమకు సంబంధించిన సమగ్ర వివరాలతో నివేదిక అందించాలని కలెక్టర్‌కు సూచించారు. ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బట్టిసావర్గాం శివారులో రూ.40 కోట్లతో నిర్మిస్తున్న ఐటీ టవర్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజ్‌కుమార్ ద్వారా పనుల ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడెకరాల్లో నిర్మిస్తున్న టవర్ ఫేజ్-1ను అభివృద్ధి చేసి జనవరి నెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తద్వారా 537 మంది యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అలాగే పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో ఆస్తి, ప్రాణ, పంట నష్టం వాటిల్లకుండా కరకట్టల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, కంది శ్రీనివాసరెడ్డి, బాలూరి గోవర్ధన్ రెడ్డి, ఇరిగేషన్‌శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

సర్వే చేసి పరిహారం అందిస్తాం..



పెన్‌గంగ ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి

జైనథ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలపై త్వరలోనే పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి, బాధిత రైతులకు నష్ట పరిహారం అందేలా చూస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని డొల్లార సమీపంలో గల పెన్‌గంగ ఉధృతిని పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆస్తి, ప్రాణ నష్టం వంటివి జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి తిరుగు ప్రయాణంలో కామాయి ఎక్స్‌రోడ్ వద్ద రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. నీట మునిగిన పంట చేలపై ఆరా తీశారు. అనంతరం ఆదిలాబా ద్ వైపు వస్తుండగా మాండగాడ గ్రామానికి చెందిన పలురువు దళిత బస్తీ లబ్ధిదారులు ఏఎంసీ మాజీ చైర్మన్ ముక్కెర ప్రభాకర్ ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు. తమ చేలు పూర్తిగా నీట మునిగాయని, పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు. స్పందించిన మంత్రి ఎవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

'మంత్రి శ్రీధర్‌బాబు రైతులకు క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. జిల్లాకు వచ్చిన మంత్రి రైతులను పరామర్శించడానికా, లేక సీసీఐని సందర్శించడానికా అనేది చెప్పాలన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలతో రైతులు నష్టపోతే మంత్రి కనీసం పరామర్శించలేకపోయారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కమీషన్ల కోసమే మంత్రిని సీసీఐ ఫ్యాక్టరీకి తీసుకెళ్లారని ఆరోపించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే అయి ఉండి రైతుల పక్షాన నిలబడకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలా వ్యవహరించారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం సీసీఐలోని యంత్రాలను స్క్రాప్ కింద విక్రయించాలని ఇదివరకే నోటిఫికేషన్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. సీసీఐని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర జరుగుతుందని జోగు ఆరోపించారు.

మట్టి వినాయకులకు ప్రాధాన్యమివ్వాలి

- పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: గణేశ్ నవరాత్రోత్సవాలు, మిలాద్ ఉన్ నబీ వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆయా పండుగలు పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా మతపెద్దలు, పోలీసు, రెవెన్యూ విద్యుత్, ఎక్సైజ్, మున్సిపల్, ఫైర్, నీటిపారుదల శాఖల అధికారులతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేలా మట్టి వినాయకులకు ప్రాధాన్యతనివ్వాలని గణేశ్ మండపాల నిర్వాహకులకు సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టడంతో పాటు రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చాలని, పారిశుద్ధ్య నిర్వహణపై బల్దియా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. గణేశ్ నిమజ్జనం రోజున మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు వీలుగా టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే ఆయా మండపాల వివరాలను నిర్వాహకులు విధిగా పోలీస్‌శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలుంటే ట్రాన్స్‌కో ఎస్‌ఈని 9440811700లో సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ మూడు షిఫ్టుల్లో పెట్రోలింగ్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌ను ప్రజలు నమ్మవద్దని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కంట్రోల్ రూం ద్వారా నిరంతర పర్యవేక్షిస్తామని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, ఆర్డీవోలు వినోద్ కుమార్, జీవాకర్ రెడ్డి, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులు వీరే

- జిల్లాలో 71 మంది ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ఈనెల 5న విద్యాశాఖ ఆధ్వర్యంలో గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 71 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు డీఈవో ప్రణీత తెలిపారు. వీరిని జెడ్పీ సమావేశ మందిరంలో సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన ఉపాధ్యాయుల వివరాలిలా ఉన్నాయి.



పేరు	పాఠశాల
ఎస్ఏలు..	
ఎస్.రాములు	జెడ్పీఎస్ఎస్,యాపల్‌గూడ
కె.అశోక్	అంకోలి
గణేష్ కుమార్	యూపీఎస్, ఓల్డ్‌బస్టాండ్
సార ఖాతూన్	ఆదిలాబాద్
అజయ్	ఆదిలాబాద్
సి.రమేశ్	వాఘాపూర్
కె.శివాని	జెడ్పీఎస్ఎస్, మన్నూర్
పి.గిరిధర్	తోషం
పి.పండరి	జెడ్పీఎస్ఎస్, ఇచ్చోడ
శ్రీనివాస్	జెడ్పీఎస్ఎస్, ఇచ్చోడ
సంజీవ్‌రెడ్డి	కోకస్‌మన్నూర్
అన్వర్‌అలీ	సొనాల
రవికుమార్	సాలెవాడ(కె)
అతాఉర్ రహ్మాన్	జెడ్పీఎస్ఎస్, ఉట్నూర్
నగేశ్	కొబ్బాయి
ప్రవీణ్	సిర్పన్న
భూపాల్	జెడ్పీఎస్ఎస్,పెండల్‌వాడ
సంజీవ్ రెడ్డి	జెడ్పీఎస్ఎస్, బేల
సంజయ్ రెడ్డి	తరోడ(బి)
హన్మంత్‌రావు	జెడ్పీఎస్ఎస్, లక్ష్మీపూర్
రమేష్ కుమార్	ధనోరా
అనిల్ కుమార్	తాంసి
శ్రీనివాస్	బజార్‌హత్నూర్
గెడం నాందేవ్	జెడ్పీఎస్ఎస్, ఇంద్రవెల్లి
కె.గణేశ్	ఏమైకుంట
కె.రవీంద్రచారి	ఇంద్రవెల్లి
టి.రమేశ్	తలమడుగు(యు)
పద్మ	పల్లి(బి)
ఎ.లక్ష్మణ్	జెడ్పీఎస్ఎస్, తడిహత్నూర్
కె.లక్ష్మణ్	జెడ్పీఎస్ఎస్, నార్నూర్
తిరుపతి	జెడ్పీఎస్ఎస్, నేరడిగొండ
ఎస్జీటీలు	
రాథోడ్ మీరాబాయి	తంతోలి
మారుతి	శాంతపూర్
వి.నరేష్	సుంకిడి
ఆర్.రాజేశ్వరి	రాంపూర్(బి)
నరేష్ కుమార్	మసాల(బి)
మదన్‌లాల్	గణేష్‌పూర్
సి.భూమన్న	అడెగాం
గంగాసాగర్	మందబొగడ
రాథోడ్ కవిత	యూపీఎస్, ఉట్నూర్
చిన్నబాబు	ఘన్‌పూర్
పి.ఊశన్న	జామిని
సీహెచ్. రవీందర్	ఎంపీఎస్ఎస్, కోర్టా
ప్రియతమ్ కుమార్	గోముత్రి
ప్రభాకర్	గుబిడిపల్లి
మల్లయ్య	వర్తమన్నూర్
రాజు	గంగాపూర్
విద్యాసాగర్	కొల్హారి
ఎ.జగన్	కుచులాపూర్
జగన్నాథ్	నార్నూర్
తుకారాం	ధాబా(బి)
సురేందర్	కొలామ
జె.అంబారావు	రోల్‌మామడ
పీజీ హెచ్‌ఎం..	
నీలాదేవి	ఆర్పీఎల్, ఆదిలాబాద్
ఎం.చక్రపాణి	వాంకిడి
ఆర్.దేవిదాస్	గుడిహత్నూర్
ఆర్.అనితదేవి	పెర్కగూడ, ఉట్నూర్
రమేష్	చప్రాలా
రాధాకృష్ణమూర్తి	జెడ్పీఎస్ఎస్, భీంపూర్
పీఎస్ హెచ్‌ఎం..	
మల్లయ్య	ఆర్పీఎల్, ఆదిలాబాద్
సాహెబ్‌రావు పవార్	వాఘాపూర్
పి.గంగారాం	సిరికొండ
హేమన్‌రావు	ఇచ్చోడ
ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం..	
దశరథ్	బంజారతాండ
ఆర్.శంకర్	ధన్నూర్(బి)
శంషీర్ ఖాన్	కప్పర్ల
పి.నాగభూషణం	ఎల్పీ,హిందీ,పార్డి(బి)
నిఖత్ ఫర్వీన్	పీజీటీ, మోడల్ స్కూల్, జైనథ్
కవిత	ఎస్‌వో, కేజీబీవీ, ఆదిలాబాద్‌రూరల్
సునిత	పీజీ సీఆర్టీ, కేజీబీవీ, బోథ్
హృదయ	సీఆర్టీ, కేజీబీవీ, బజార్‌హత్నూర్

క్లుప్తంగా

న్యాయవాదికి 'వల్లభాయ్ పటేల్' పురస్కారం


పురస్కారంతో న్యాయవాది సుధీర్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తి పురస్కారాన్ని పట్టణానికి చెందిన న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రముఖ సంఖ్య శాస్త్రవేత్త దైవాజ్ఞ శర్మ, బీసీ కమిషనర్ వకులాభరణం కృష్ణ, సత్య సంగీత ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఓంకార్ రాజ్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.

ఆర్జీయూకేటీలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన


శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న అధికారులు

బాసర: ఆర్జీయూకేటీలో విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ సైబర్ సెక్యూరిటీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా క్లౌడ్ కంప్యూటింగ్ గురించి ఉపన్యాసకుడు శ్రీకాంత్ వివరించారు. డౌన్‌లోడ్ చేసుకున్న పాటలు, వీడియోలు డాక్యుమెంట్స్ కంప్యూటర్లలో స్పేస్ సరిపోకపోతే క్లౌడ్‌లో తీసుకోవచ్చునని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ల్యాప్‌టాప్, ఫోన్లలో అనుమానితులు పంపే ఈమెయిల్ లింక్‌లు క్లిక్ చేయొద్దన్నారు. అనంతరం ఉపన్యాసకుడిని సన్మానించారు. సమన్వయకర్త కిరణ్ కుమార్, పవన్, చీఫ్ వార్డెన్ ఆకుల శ్రీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా దొడర్నా చెరువు కట్ట


చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

కుభీర్: మండలంలోని దొడర్నా చెరువు కట్ట ప్రమాదకరంగా మారింది. అధికారులు రూ.6 లక్షల నిధులతో కట్టపై అక్కడక్కడ మొర్రంతో తూతూమంత్రంగా పనులు చేపట్టారు. ప్రస్తుతం కట్ట ప్రమాదకరంగా ఉండడంతో గ్రామస్తులు అధికారులకు ఫోన్ ద్వారా వివరించారు. మంగళవారం తహసీల్దార్ ఎం.సోము, ఎంపీడీవో మోహన్‌సింగ్‌లు చెరువు కట్టను పరిశీలించారు. కాగా, ప్రస్తుతం తూము గేట్లు తెరిపించామని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయమై ఏఈ రమేశ్‌ను వివరణ కోరగా, మరమ్మతు జరిగాయి కావాలంటే ఫొటోలు ఇస్తాను ఫ్రంట్ పేజీలో వేసుకోండని దురుసుగా సమాధానమిచ్చారు.

'గిరి' పల్లెలో మృగాడు

- ఆదివాసీ మహిళపై ఆటో డ్రైవర్ లైంగికదాడికి యత్నం
- ప్రతిఘటించడంతో తీవ్రంగా కొట్టిన నిందితుడు
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- గాంధీ ఆస్పత్రిలో కోలుకుంటూ వాంగ్మూలం ఇచ్చిన బాధితురాలు
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన


జైనూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

సాక్షి, ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం దేవుగూడ గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ(గోండు) మహిళపై అత్యాచార యత్నం, హత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఘటనలో బాధితురాలు తీవ్రంగా గాయపడింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లుగా కుటుంబ సభ్యులు భావించి ఈ నెల 1న సిర్పూర్(యూ) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖంపై తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఆదివారం రాత్రి సిర్పూర్(యూ) పోలీసులకు వివరాలు తెలియజేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలం దేవుగూడకు చెందిన మహిళ(45) మక్కపిండి పట్టించడం కోసం గత శనివారం జైనూర్‌కు వచ్చింది. అదేరోజు పొలాల అమావాస్య కావడంతో సోయంగూడలో నివసిస్తున్న తన తల్లి ఇంటికెళ్లి రాఖీ కట్టేందుకు బయలుదేరాలని నిర్ణయించుకుంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అటుగా వెళ్తున్న సోనుపటేల్‌గూడకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ మగ్దూం ఆమెతో మాటలు కలిపాడు. తనూ అటే వెళ్తున్నా అంటూ ఆమెను ఆటో ఎక్కాలని సూచించాడు. మొదట తటపటాయించిన మహిళ అతని మాయ మాటలు నమ్మి ఆటో ఎక్కింది. ఆ సమయంలో ఆటోలో మరెవరూ లేరు. రాఘవాపూర్ గ్రామం దాటి అటవీ ప్రాంతానికి చేరుకోగానే ఆటోడ్రైవర్ ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడమే కాకుండా తీవ్రంగా ప్రతిఘటించడంతో ఆగ్రహంతో ఆటోడ్రైవర్ షేక్ మగ్దూం కర్రతో తీవ్రంగా ముఖంపై దాడి చేశాడు. దీంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది.

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం..

కర్రతో తీవ్రంగా కొట్టడంతో ఆదివాసీ మహిళ స్పృహ తప్పిపడిపోగా.. ఆమె చనిపోయిందని భావించిన ఆటోడ్రైవర్ మగ్దూం ఆ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఘటనాస్థలి నుంచి తీసుకొచ్చి ఆమెను రోడ్డుపై పడేసి అక్కడి నుంచి జారుకున్నాడు. బాధితురాలు రోడ్డుపై పడి ఉన్న సమయంలో అటుగా ఓ వాహనం వెళ్లినట్లు గుర్తించిన స్థానికులు ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిందని భావించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలిని వెంటనే జైనూర్ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌కు అటు నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. మరుసటి రోజు ఆదివారం ఆమె సోదరుడు సిర్పూరు(యూ) పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సైతం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లుగా కేసు నమోదు చేశారు.

బాధితురాలి వాంగ్మూలంతో..

ముఖం, పెదాలపై తీవ్రగాయాలు అవడంతో బాధితురాలు రెండు రోజులపాటు మాట్లాడలేకపోయింది. సోమవారం కొంత కోలుకోగానే కుటుంబసభ్యులు సిర్పూరు(యూ) పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాంగ్మూలం రికార్డు చేసేందుకు వెళ్లిన పోలీసులకు బాధితురాలు పెదాలకు కుట్లు పడినా బాధను దిగమింగుకుని ఆటోడ్రైవర్ అఘాయిత్యాన్ని వివరించింది. దీంతో కేసు మలుపు తిరిగింది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలంతో అత్యాచార యత్నం, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద సిర్పూర్(యూ) పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం జైనూర్‌లో ఆటోడ్రైవర్ షేక్ మగ్దూంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సమక్షంలో నిందితుడు నేరం అంగీకరించినట్లు తెలిసింది. వెంటనే నిందితుడిని సిర్పూరు(యూ) పోలీసులు ఆసిఫాబాద్‌కు తరలించారు.

నిందితుడిని ఉరి తీయాలి

జైనూర్(ఆసిఫాబాద్): ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి యత్నించి, ఆపై హత్య చేయాలని ఉద్దేశంతో తీవ్రంగా గాయపర్చిన వ్యక్తిని వెంటనే ఉరి తీయాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవ్‌రావు డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలనే డిమాండ్‌తో మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మగ్దూం అనే ఆటోడ్రైవర్ ఆదివాసీ మహిళను తీవ్రంగా గాయపర్చాడని తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న సీఐ రమేశ్, ఎస్సై సాగర్ ఘటనాస్థలికి చేరుకున్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు చాహకటి గణేశ్, రవీందర్, శేకు పాల్గొన్నారు.

నేడు జైనూర్ బంద్‌కు పిలుపు

ఆదివాసీ మహిళపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం జైనూర్ మండల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు. వ్యాపారసంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు.

కర్ర ట్రాక్టర్



ఇన్‌సెట్ లో గుండోల్ల రాజు

కర్రతో చేసిన కళాఖండాలు అద్భుతంగా ఉంటాయి. నిర్మల్ కొయ్య బొమ్మలకు ప్రతీక. కర్ర దొరకకపోవడంతో ప్రస్తుతం కొయ్యబొమ్మల తయారీ తగ్గింది. ఇదిలా ఉంటే.. సర్సాపూర్ (జ)మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వడ్రంగి గుండోల్ల రాజు కర్రతో బుల్లి ట్రాక్టర్‌ను కళాత్మకంగా రూపొందించాడు. నిజంగా ట్రాక్టర్‌కు ఉన్నట్లుగానే చక్రాలు, ఇంజన్, ముందు భాగం, వాహన చోదకుడి సీటు, పొగ గొట్టం ఉన్నాయి. అద్భుతంగా తీర్చిదిద్దిన కళాఖండాన్ని చూసిన పలువురు వడ్రంగి రాజు ప్రతిభను అభినందిస్తున్నారు. - సర్సాపూర్ (జ)

యువతిని కాపాడిన పోలీసులు

నిర్మల్‌రూరల్: బావిలో పడి ఆత్మహత్యకు యత్నించిన యువతిని పోలీసులు కాపాడారు. రూరల్ ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన యువతి సునీత కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకునేందుకు మంగళవారం ఆ కాలనీలోని బావి వద్దకు వెళ్లింది. స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుళ్లు రవిశంకర్, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఆమెను కాపాడారు. సునీతకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదగాలి


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం


జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

- ఎస్పీ గౌస్ ఆలం
- సెక్యూరిటీ గార్డుల జాబ్‌మేళాకు స్పందన

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగంలో చేరిన వారు అంచెలంచెలుగా ఎదగాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లాకేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో ఆదిలాబాద్ సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సెక్యూరిటీగార్డుల జాబ్‌మేళాకు స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జీఎంఆర్, రక్షా సంస్థ సహకారంతో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి సెక్యూరిటీగార్డు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒకనెల శిక్షణ తీసుకుని ఎయిర్‌పోర్టు, షిప్పింగ్ యార్డుల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మేళాలో 500 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్‌రావు, ఫణిందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి కాలువకు గండి


తెగిన బ్రిడ్జి కాలువ

లక్ష్మణచాంద: అన్ని గ్రామాల్లో గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. ఒకటి నిండిన తర్వాత మరో చెరువులోకి నీరు వెళ్లే అవకాశం ఉంది. రాచాపూర్ వద్ద సరస్వతి కాలువపై ఉన్న చెరువు నీటితో నిండాక మరో రెండు చెరువులు నింపడానికి చిన్న చిన్న బ్రిడ్జి కాలువలు ఉన్నాయి. ఇందులో రాచాపూర్ సమీపంలో సరస్వతి బ్రిడ్జి కాలువ తెగింది. వర్షపు నీరుతోపాటు పొలాల నుంచి నీరు వెళ్తుండడంతో కాలువ గట్టు పూర్తిగా కూలుతుంది. ఓ వైపు సరస్వతి కాలువకు గండి పడటంతోపాటు చెరువులోకి నీళ్లు రావడం లేదని రైతులు అంటున్నారు. ఇదే సమయంలో కాలువ పక్క నుంచి వడ్యాల్ నుంచి రాచాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా చేసే 33 కేవీ లైన్ ఉంది. ఇందులో ఒక స్తంభం పక్కన గల మట్టి పూర్తిగా కొట్టుకుపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


గండి పడుతున్న దృశ్యం

వామ్మో వానరాలు



భైంసాటౌన్: పట్టణంలో కోతుల బెడద వేధిస్తోంది. ఓ వైపు వీధి కుక్కలు వెంటబడి గాయపరుస్తుంటే, మరోవైపు కోతులు ఇళ్లలోకి చేరి భయాందోళనకు గురిచేస్తున్నాయి. మంగళవారం కిసాన్‌గల్లిలో వానర దండు ఓ ఇంటిని చుట్టుముట్టింది. మహిళ ఇంట్లోకి వెళ్తుండగా, ఒక్కసారిగా కోతులు ఆమెను చుట్టు ముట్టడంతో భయాందోళనకు గురైంది. ఈ ఘటనలో ఆమె కాలి వద్ద చిన్నపాటి గాయమైంది. కాలనీలో చిన్నపిల్లలు ఉండడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ, మున్సిపల్ అధికారులు కోతుల బెడద తీర్చాలని కోరుతున్నారు.


కిసాన్‌గల్లిలో ఇంటి వద్ద చేరిన కోతుల గుంపు

పురుగుల మందు తాగి ఆత్మహత్య


పోశెట్టి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

తానూరు: కిడ్నీ వ్యాధినయం కావడం లేదని మనస్తాపంతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భానుప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలోని భోసి గ్రామానికి చెందిన ఉమ్మడి పోశెట్టి (45).. 2021 నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్, భైంసా, నాందేడ్‌కు వెళ్లి చికిత్స తీసుకున్నా నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. సోమవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా పురుగుల మందు తాగాడు. ఉదయం చూసేసరికి మృతిచెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉంది.

కుటుంబ కలహాలతో వ్యక్తి..


శివానంద్ మృతదేహం

గుడిహత్నూర్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు..మహారాష్ట్రకు చెందిన కదం శివానంద్(28)కు గుడిహత్నూర్ మండలం మన్నూర్‌లోని సాయినగర్‌కు చెందిన వర్షతో గత పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా సాయినగర్‌లో ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో అత్తమామలతోపాటు భార్య తరపు బంధువులు ఆయన్ను వేధించసాగారు. భరించలేక సూసైడ్ నోట్ రాసి మంగళవారం తెల్లవారు జాము తన ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: లైంగికదాడికి యత్నించిన ఒకరికి మూడు నెలల సాధారణ జైలుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నిర్మల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు.కోర్టు సమన్వయల అధికారి దల్లుసింగ్ కథనం ప్రకారం..2018 ఏప్రిల్ 3న దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ కాలకృత్యాలు తీర్చుకోవడానికి గ్రామ శివారు ప్రాంతానికి వెళ్లింది. ఆ సమయంలో శ్రీను లైంగికదాడికి యత్నించగా, వెంటనే తప్పించుకుని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. బాధితురాలు ఫిర్యాదుతో అప్పటి ఎస్సై హరిబాబు కేసు దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ రామకృష్ణ ఆరుగురు సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. నిర్మల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారు.

గోదావరికి శాంతిపూజ


గోదారమ్మకు హారతి ఇస్తున్న ఆలయ అర్చకులు

బాసర: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరినది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. మంగళవారం గంట గంటకు నదిలో వరద ప్రవాహం పెరిగింది. ఎగువన మహారాష్ట్రతోపాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో శ్రీజ్ఞాన సరస్వతి ఆలయ వైదిక బృందం ఆధ్వర్యంలో గోదారమ్మకు అర్చకులు, అధికారులు, భక్తులు శాంతి పూజలు చేశారు. ఒడి బియ్యం చీర, సారె సమర్పించారు. హారతి ఇచ్చారు.

గోదావరి హారతి

గోదావరికి మంగళవారం వేకువజామున శ్రీవేద విద్యానందగిరిస్వామి ఆధ్వర్యంలో వేద ఋషి కుమారులతో హారతి, గుగ్గిల ధూప దీప నైవేద్య హారతి, సనాతన వేద భారతి పీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. విశేష పూజలో భక్తులు పాల్గొన్నారు.


గోదారమ్మకు హారతి ఇస్తున్న వేద పాఠశాల పిల్లలు

తహసీల్దార్లకు పోస్టింగ్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో పలువురు డిప్యూటీ తహసీల్దార్లు తహసీల్దార్లుగా పదోన్నతి పొందగా ఆయా జిల్లాల్లో పోస్టింగ్ కేటాయిస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పదోన్నతులు పొందిన వారికి మల్టీ జోన్ పరిధిలో ఖాళీల ప్రకా రం జిల్లాలకు కేటాయించారు. ముగ్గురు మంచి ర్యాల, నిర్మల్ జిల్లా నుంచి ఒకరిని ఆదిలాబాద్‌కు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఒకరిని ఆదిలాబాద్‌కు, మరొకరికి జగిత్యాల జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఇక పెద్దపల్లి జిల్లా నుంచి ముగ్గురిని, జగిత్యాల జిల్లా నుంచి ఒకరిని ఆసిఫాబాద్ జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. ఒకరిని మంచిర్యాల జిల్లాకు ఇచ్చారు. వీరికి ఖాళీల ప్రకారం మండలాల్లో విధుల్లో చేరనున్నారు.

స్తంభాలపై విరిగిపడ్డ చెట్లు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్-ఖానాపూర్ మార్గంలో 11 కేవీ ఏజీఎల్ ఫీడర్‌పై మంగళవారం భారీ వృక్షం విరిగిపడింది. దీంతో వైర్లు తెగిపోవడంతో పాటు పలు స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.



